సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 5 । ఏప్రిల్ । 2024




జనసేనకు ఆదిలోనే హంసపాదు

భీమవరంలో జనసేన పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించగా **అనుమతులు లేవంటూ అధికారులు కన్నెర్ర చేసి జెండాలను తొలగించారు.** IIలో ▸



పాదుపు సొమ్ముకు రెక్కలు

డ్వాక్రా యానిమేటర్లు, సీఏలు, ఇతర సిబ్బంది చేతివాటం ప్రదర్శించి డ్వాక్రా సభ్యులకు తెలియకుండా వారి సొమ్మును ఇష్టానుసారం దోచేస్తున్నారు. IIలో ▸



న్యూస్‌రీల్

సంక్షేమాన్ని అడ్డుకోవడమే టీడీపీ లక్ష్యం



ఓట్లు అభ్యర్థిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుమంట్ర: ఐదేళ్లుగా పేదల అభివృద్ధి, సంక్షేమం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను అడ్డుకోవడమే లక్ష్యంగా చంద్రబాబు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ పనిచేస్తుందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం ఆయన మండలంలోని బ్రాహ్మణచెర్వులో ఎన్నికల ప్రచారం చేశారు. కరోనా తర్వాత దేశంలో ఆర్థిక సంక్షోభం ఎదురైనా రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని అన్నారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం స్వచ్ఛందంగా సేవలందిస్తున్న వలంటీర్లపై మొదటి నుంచి చంద్రబాబు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీని తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా మహిళలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ ఈది అనిత, వాసంశెట్టి కిరణ్, సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక ప్రసన్నకుమార్, ఉప సర్పంచ్ భూపతిరాజు శ్రీనివాసరాజు, ఎంపీటీసీ సభ్యులు గండి రామారావు, చింతపల్లి మంగాదేవి, మాజీ సర్పంచ్ గండి శ్రీనివాసరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు తేతలి సుధీర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మీడియా సెంటర్ ప్రారంభం



మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ఎన్నికల మీడియా సెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమాచారాన్ని మీడియాకు అందించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను విచారణ చేయించి చర్యలు తీసుకుంటామన్నారు. సీ–విజిల్, కాల్ సెంటర్, పోర్టల్, సోషల్ మీడియా ద్వారా పలు ఫిర్యాదులు అందాయన్నారు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు రూ.54.06 లక్షల నగదు, రూ.8.28 లక్షల విలువైన మద్యం, వివిధ రకాల వస్తువులను సీజ్ చేశామన్నారు. జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య, డీఆర్‌ఓ జె.ఉదయ భాస్కరరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖాధికారి టి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిబంధనలు మీరితే చర్యలు

ఎన్నికలు నిబంధనలకు లోబడి కరపత్రాలు, వాల్ పోస్టర్లు ముద్రణ నిర్వహించాలని, నిబంధనలు మీరితే చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో జిల్లాలోని ప్రింటర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిబంధనలు వివరించారు.

పక్కాగా ధాన్యం సేకరణ



ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఆఖరి ధాన్యం బస్తా సేకరణ వరకు సజావుగా సాగేలా చూడాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని పట్టింపాలెం ఆర్బీకేలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లుల నుంచి వచ్చిన ప్రతి ధాన్యం సంచికీ లెక్క ఉండాలన్నారు. రైతులకిచ్చిన ధాన్యం సంచులను మిగిలిన వాటిని ఆర్బీకేల్లో జమ చేయాలన్నారు. ఏ మాత్రం తేడా వచ్చినా సంచికి రూ.31 చొప్పున సిబ్బంది వేతనాల నుంచి మినహాయిస్తామన్నారు. తేమ శాతం ఎక్కువ ఉంటే ప్రతి ఒక్క శాతానికి ఒక కిలో చొప్పున ధాన్యం తరుగు తగ్గిస్తారన్నారు. సివిల్ సప్లయిస్ డీఎం శివరామ్ మాట్లాడుతూ 7.20 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు ప్రామాణికంగా తీసుకున్నామన్నారు. ధాన్యం విక్రయించిన 21 రోజుల్లోనే సొమ్మును రైతుల ఖాతాకు సొమ్ములు జమ చేస్తామన్నారు. ఆర్డీఓ కె.చెన్నయ్య, జిల్లా సహకార అధికారి నాగరాజు పాల్గొన్నారు.

కళ్లు చల్లబడ్డాయా బాబూ!



తాడేపల్లిగూడెం రూరల్: పట్టింపాలెం సచివాలయానికి నడుచుకుంటూ వస్తున్న వృద్ధురాలు

కక్షతో ఏడిపింఛెన్
- టీడీపీ కుట్రలతో పెన్షన్ కష్టాలు
- అవ్వాతాతలకు అవస్థలు
  - మండే ఎండల్లో పడిగాపులు
  - చంద్రబాబు కుతంత్రాలపై మండిపాటు
  - జిల్లాలో 86 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి





పింఛన్ పాట్లు.. ఆకివీడులోని మాదివాడ సచివాలయం వద్ద పింఛన్ల కోసం వేచి చూస్తున్న వృద్ధులు



భీమవరంలో ఇంటికి వెళ్లి వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న అధికారులు



ఉండి: ఉండిలో లబ్ధిదారుల పడిగాపులు



కాళ్ల: కాళ్ల మండలంలో మండు టెండలో పింఛన్ కోసం వెళుతున్న వృద్ధులు



తణుకు అర్బన్: తణుకులో పింఛన్ కోసం సచివాలయానికి వస్తున్న వృద్ధురాలు

ఓ పక్క మండుతున్న ఎండలు.. మరోపక్క వడగాల్పులతో పింఛన్ సొమ్ముల కోసం వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర అవస్థలు పడ్డారు. ప్రతినెలా ఒకటో తారీఖున వేకువజామునే చిరునవ్వులతో పింఛన్ అందించే వలంటీర్‌లను దూరం పెట్టి తమకు కష్టాలు తెచ్చిపెట్టిన చంద్రబాబూ కళ్లు చల్లబడ్డాయా! అంటూ వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. తారెత్తిన ఎండల్లో పింఛన్ డబ్బుల కోసం సచివాలయాలకు పరుగులు తీశారు. జిల్లాలో రెండో రోజు గురువారం 86 శాతం మేర పింఛన్ల పంపిణీ పూర్తి కాగా నడవలేని, అనారోగ్యంతో మంచానికి పరిమితమైన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సచివాలయ ఉద్యోగులు పెన్షన్ సొమ్ములు అందించారు.

సాక్షి, భీమవరం: పింఛన్ కోసం ఉదయం నుంచే లబ్ధిదారులు సచివాలయాల వద్ద పడిగాపులు కాయడం కనిపించింది. లబ్ధిదారులు అసౌకర్యం కలగకుండా సచివాలయాల వద్ద టెంట్లు, తాగు నీరు, కుర్చీలు తదితర సదుపాయాలు కల్పించినా ఎండలు, వడగాల్పుల తీవ్రతతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా వృద్ధులు, దివ్యాంగులు అల్లాడిపోయారు. నడవలేని స్థితిలో ఉన్న వారిని కుటుంబసభ్యులు వెంట ఉండి తీసుకువచ్చారు. గత 58 నెలలుగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా పింఛన్ అందుకున్నామని, ఇప్పుడు ఇంత కష్టమొచ్చిందంటూ లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయం కోసం తమను ఇబ్బందులు పాలుచేయడం చంద్రబాబుకు తగదంటూ దుమ్మెత్తిపోశారు.

2.34 లక్షల మంది.. జిల్లాలో 2,34,884 మంది లబ్ధిదారులకు ప్రతినెలా రూ.68.91 కోట్లను ప్రభుత్వం అందిస్తోంది. వలంటీర్లకు వ్యతిరేకంగా చంద్రబాబు అనుకూల వర్గం ఫిర్యాదుల నేపథ్యంలో లబ్ధిదారులకు పాత కష్టాలు మొదలయ్యాయి. బుధవారం నుంచి సచివాలయాల వద్ద పింఛన్ పంపిణీకి ప్రభుత్వం ఏర్పాట్లుచేసింది. గురువారం 2,01,093 మంది లబ్ధిదారులకు రూ.60.9 కోట్లను అందజేసింది. నరసాపురం అర్బన్, భీమవరం అర్బన్, తాడేపల్లిగూడెం అర్బన్, పాలకొల్లు, పోడూరు మండలాల్లో 90 శాతానికి పైగా పంపిణీ పూర్తయ్యింది. ఆకివీడు అర్బన్, రూరల్, పాలకోడేరు, తణుకు మండలాల్లో 80 శాతం వరకు పంపిణీ జరగ్గా, మిగిలిన మండలాల్లో 80 శాతానికి పైగా పూర్తి చేశారు.

ఇంటి వద్దకు.. జిల్లాలో సుమారు 4 వేల మంది లబ్ధిదారులు నడవలేని, అనారోగ్యంతో మంచం పట్టినట్టు గుర్తించి వారి ఇళ్లకు వెళ్లి అధికారులు పింఛన్ డబ్బులు అందించారు. భీమవరం మారుతీ నగర్ సచివాలయ పరిధిలో ఇంటికి వెళ్లి పింఛన్ అందించే కార్యక్రమాన్ని డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్ పరిశీలించారు.

ఎండనపడి వెళుతూ..



నాలుగున్నరేళ్లుగా ఇంటి వద్దే పింఛన్ పొందాను. ఈ రోజు ఎండనబడి పంచాయతీ ఆఫీస్‌కు నడిచి వెళ్లి పింఛన్ తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఒకటో తేదీన వలంటీర్ వస్తే జగన్ బాబు నా ఇంటికి వచ్చినంత సంతోషంగా ఉండేది. 80 ఏళ్లలోనూ ఆరోగ్యంగా ఉన్నానంటే జగన్‌బాబు ఇచ్చిన నమ్మకంతోనే.

– దంగేటి అనసూయ, పెనుమంట్ర

కష్టం తెలిసేది కాదు



వలంటీర్ ఇంటికే వచ్చి పింఛన్ ఇస్తుంటే ఇబ్బంది ఉండేది కాదు. ఒక్కరోజు బయటకు వచ్చి పింఛన్ తీసుకోవాలంటే సొమ్మసిల్లి పడిపోవాల్సి వస్తుంది. వయోభారంతో పాటు షుగరు, బీపీ వల్ల నడవలేని పరిస్థితి. సచివాలయానికి వెళ్లి వృద్ధులం పింఛన్ కోసం తాపత్రయం పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

–పప్పుల లక్ష్మీనారాయణ, కాళింగగూడెం

చంద్రబాబు నీచబుద్ధితో..



నాకు వితంతు పింఛన్ వస్తోంది. కొంతకాలంగా క్యాన్సర్ సమస్యతో బాధపడుతున్నాను. ప్రతి నెలా 1వ తేదీన ఇంటికే వచ్చి పెన్షన్ ఇచ్చేవారు. చంద్రబాబు నీచబుద్ధితో ఈ రోజు చాలా ఇబ్బంది పడుతూ సచివాలయానికి రావాల్సి వచ్చింది. 14 ఏళ్లు పాలించిన వ్యక్తి ఇలాంటి అడ్డంకులు కల్పించడం సరికాదు.

– నెల్లూరు ధనలక్ష్మి, మొగల్తూరు

వృద్ధులను బాధపెట్టొద్దు బాబూ



నాకు 88 ఏళ్లు. సీఎం జగన్ వలంటీర్ల ద్వారా పింఛన్ ఇంటికే పంపేవాడు. నాకు ఆరోగ్యం సరిగా లేదు. చేతికర్ర సాయంతో ఇప్పుడు పంచాయతీకి వెళ్లాలంటే ఎలా. చంద్రబాబు గెలవాలంటే ప్రజలకు మంచి చేయాలి గాని ఇలా బాధపెడితే ఎవరూ ఓట్లేస్తారు. వృద్ధులను బాధపెట్టడం చంద్రబాబుకు తగదు.

– రొక్కల సక్కుబాయి, వెలివర్రు



ఉండి: ఇంకెన్నాళ్లో ఈ కష్టాలు..

రాజకీయ కుట్రలతో..



నేను నరసాపురం మూడో వార్డులో ఉంటున్నాను. బీపీ, మోకాళ్ల నొప్పులు ఉన్నాయి. గతంలో వలంటీర్లే అన్ని చూసుకునేవారు. 1వ తేదీనే డబ్బులు ఇచ్చేవారు. ఇప్పుడు ఎండల్లో సచివాలయానికి వెళ్లి పెన్షన్ తెచ్చుకోవాలంటే చాలా కష్టం. రాజకీయ కుట్రలతో వలంటీర్లను పక్కన పెట్టడం దుర్మార్గం.

– కోడి వీరరాఘవులు, నరసాపురం

కుంటుకుంటూ వచ్చాను



నాకు ఆరోగ్యం సహకరించదు. ఈనెల పింఛన్ కోసం సచివాలయానికి వెళ్లాలనడంతో కుంటుకుంటూ వచ్చాను. ఎండ ఎక్కువగా ఉండటంతో చాలా ఇబ్బంది పడ్డాను. వలంటీర్లు ఉంటే మాకు ఈ ఇబ్బంది ఉండేది కాదు. గతంలో మాదిరి వలంటీర్ల ద్వారా ఇంటి వద్దనే ఇచ్చే ఏర్పాటు చేయాలి.

– నంది సత్యం, ఆరవల్లి

గంటల తరబడి వేచి ఉన్నా..



ఈనెల నుంచి వలంటీర్‌లతో కాకుండా సచివాలయం వద్ద ఫించన్ ఇస్తున్నారని చెప్పడంతో నా మనవడు సహాయంతో వచ్చా. గంటల తరబడి వేచి ఉన్నా. వలంటీర్ ద్వారా పింఛన్ ఇవ్వడం వల్ల మాలాంటి వృద్ధులకు చాలా మేలు జరిగింది. ఇప్పుడు సచివాలయానికి రావాలంటే ఇక్కట్లు పడాల్సి వస్తోంది.

– రంభ సత్తెమ్మ, అత్తిలి

చంద్రబాబుకు ఇది న్యాయమా



సీఎం జగన్ ఇంటి గుమ్మం వద్దకే పింఛన్లు అందించారు. నేడు గత టీడీపీ పాలన మరలా వచ్చిందా అన్నట్టు అనిపిస్తోంది. నడవలేని స్థితిలో ఉన్న మేం సచివాలయానికి వచ్చి పింఛన్ తీసుకోవాలంటే ఎలా కుదురుతుంది. వలంటీర్లను నిలిపివేయించిన చంద్రబాబుకు ఇది న్యాయమా.

– మందరపు, గంగాధరరావు, తణుకు

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



తాడేరులో కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్: మండలంలోని తాడేరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ సెక్రటరీ నామన మహేష్ ఆధ్వర్యంలో 50 మంది టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో షేక్ ఖాన్ బాషా, నేదురి తాతయ్య, మట్టా యేసు, భూపతి కిషోర్, నామన నానాజీ, యిర్రింకి దుర్గారావు, జువ్వల శ్రీను తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహరావు, మండల అధ్యక్షుడు తిరుమాని ఏడుకొండలు, మండల జేసీఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు, నాయకులు బండి శక్తీశ్వరసాంబమూర్తి, శిరిగినీడి ప్రసాద్, గూడపాటి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మూల్యాంకనం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకన కార్యక్రమం గురువారంతో ముగిసింది. గత నెల 9న స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంస్కృతం జవాబు పత్రాల మూల్యాంకనంతో ప్రక్రియ ప్రారంభం కాగా 18 నుంచి ఇతర సబ్జెక్టులకు సంబంధించిన మూల్యాంకనం ప్రారంభమైంది. మొత్తం 755 మంది అధికారులు పాల్గొన్నారు.

వృద్ధుల ఉసురు పోసుకుంటున్న కూటమి

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెంలో ఎన్నికల ప్రచారంలో మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎంపీ అభ్యర్థి ఉమాబాల

తాడేపల్లిగూడెం అర్బన్: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఇంటికే పింఛన్లు అందిస్తూ సీఎం జగన్ ప్రజల ఆదరాభిమానాలు సంపాదిస్తే.. పచ్చ కూటమి పింఛన్ లబ్ధిదారుల ఉసురు పోసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొట్టు సత్యనారాయణ, నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల అన్నారు. గురువారం పట్టణంలోని కడకట్ల ప్రాంతాల్లో గడపగడపకు వైఎస్సార్‌సీపీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ వైఎస్సార్‌సీపీకి మళ్లీ పట్టం కట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా ఒకటో తారీఖున వేకువజామున వృద్ధులకు ఇంటి వద్దే పింఛన్లు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. పచ్చ కూటమి కుట్రలతో వలంటీర్లను సేవలకు దూరం చేశారని, ఇది తాత్కాలికమేనని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 స్థానాల్లో విజయ దుందుభి మోగిస్తుందని, మరలా ఇంటికే వలంటీర్ల ద్వారా సీఎం జగన్ సేవలందిస్తారన్నారు. కడకట్లకి చెందిన వృద్ధుడు బండి సుబ్బారావు పింఛన్ కోసం వెళ్లి స్పృహ తప్పి పడిపోవడం బాధాకరమన్నారు. పచ్చ కూటమి అధికారంలోకి వస్తే పేదలకు పథకాల ద్వారా ఇస్తున్న సొమ్ములను కాజేసేందుకు పన్నాగాలు పన్నుతున్నారని, ఇందులో పవన్‌కళ్యాణ్‌కు వాటా ఇవ్వొచ్చని చంద్రబాబు ఆలోచన ఉందని విమర్శించారు. రాష్ట్రంలో 90 లక్షల మంది డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి మోసం చేసిన చంద్రబాబుకు ఇప్పుడు ఓట్లు వేసేందుకు ఎవరూ సిద్ధంగా లేరన్నారు. ఎన్నికల నెపంతో రాష్ట్రంలో 66 లక్షల మంది పింఛన్‌దారుల ఉసురు చంద్రబాబు పోసుకుంటున్నారన్నారు. వీరికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వలంటీర్లు నిస్వార్థంగా సేవలందిస్తున్నారని కొనియాడారు. వచ్చే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాను గుర్తుకే వేసి తమను గెలిపించాలని ఆయన కోరారు. నరసాపురం ఎంపీ అభ్యర్థి గుడూరి ఉమాబాల మాట్లాడుతూ సీఎం జగన్ వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా ఇంటికే పథకాలను చేరువ చేశారన్నారు. ప్రజలంతా మళ్లీ జగన్‌కే పట్టం కడతామంటూ చెప్పడం చాలా ఆనందంగా ఉందన్నారు. నాయకులు కర్రి భాస్కరరావు, కోడే అప్పారావు, వార్డు ఇన్‌చార్జి మారిశెట్టి రమణ, కొట్టు విశాల్, దాసి బాబు, బొద్దాని శ్రీనివాసు, బోళెం రమణ, బోళెం రామలక్ష్మి, నూనె అనురాధ ఉన్నారు.

క్లుప్తంగా

ఉమ్మడి పశ్చిమలో ఇద్దరు జడ్జిల బదిలీ

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర వ్యాప్తంగా 30 మంది జడ్జిలను బదిలీ చేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని ఏలూరు ఒకటో అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్ తిరుపతి ఐదవ, ఫ్యామిలీ కోర్టు జడ్జిగా బదిలీ అయ్యారు. భీమవరం మూడో అడిషనల్ జిల్లా జడ్జిగా పనిచేస్తున్న పి.శ్రీసత్యదేవి స్పెషల్ సెషన్స్ జడ్జి ఎస్సీ, ఎస్టీ కోర్టు విశాఖపట్టణానికి బదిలీ అయ్యారు. ఒంగోలు పోక్సో కోర్టు జడ్జిగా పనిచేస్తున్న ఎంఏ సోమశేఖర్ భీమవరం పోక్సో కోర్టు జడ్జిగా బదిలీపై రానున్నారు. ఇప్పటివరకు ఇక్కడి జడ్జి పోస్టు ఖాళీగా ఉంది. విజయనగరం ఎస్సీ, ఎస్టీ కోర్టు, నాలుగో అడిషనల్ జిల్లా అండ్ సెషన్స్ జడ్జిగా పనిచేస్తున్న షేక్ సికిందర్ తాడేపల్లిగూడెం 9వ అడిషనల్ జిల్లా అండ్ సెషన్స్ జడ్జిగా బదిలీపై రానున్నారు. ఇక్కడి జడ్జి పోస్టు ఇప్పటివరకు ఖాళీగా ఉంది.

నాటు తుపాకీ స్వాధీనం



నిందితుడు, నాటు తుపాకీతో రూరల్ ఎస్సై

కైకలూరు: తనిఖీల్లో భాగంగా సీతనపల్లి గ్రామంలో ఓ వ్యక్తి నుంచి నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నామని రూరల్ ఎస్సై టి.రామకృష్ణ గురువారం చెప్పారు. తమిళనాడు రాష్ట్రం వెల్లూరు జిల్లాకు చెందిన ఎస్.విజయన్ లైసెన్స్ లేకుండా నాటు తుపాకీని తీసుకెళుతుండగా పట్టుకున్నామన్నారు. ఏవరైనా మారణాయుధాలు కలిగి ఉంటే పోలీసు సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఏలూరు టౌన్: చొదిమెళ్ల ప్రాంతంలో హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు మిర్చి యార్డు ప్రాంతం సాయినగర్ కు చెందిన అన్నవరపు పుష్పరాజు (30) ఈనెల 3న రాత్రి తణుకు నుంచి తన మోటారుసైకిల్‌పై గుంటూరు వెళుతుండగా ఏలూరు నగర శివారు చొదిమెళ్ల సమీపంలో మోటారుసైకిల్ అదుపు తప్పి రహదారి పక్కనే ఉన్న ఇనుప గ్రిల్స్‌పై పడి తీవ్ర గాయాలపాలై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఏలూరు త్రీటౌన్ పోలీసులు మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఈ ప్రమాదంపై ఏలూరు త్రీటౌన్ సీఐ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు సిబ్బంది కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పొదుపు సొమ్ముకు రెక్కలు

- యానిమేటర్లు, సీఏలు, సిబ్బంది చేతివాటం
- డ్వాక్రా మహిళల బ్యాంక్ ఖాతాలకు చిల్లు
- పట్టించుకోని బ్యాంక్ అధికారులు, సిబ్బంది
- డ్వాక్రా మహిళల సొమ్ముకు భద్రతపై నీలినీడలు



దువ్వ యూనియన్ బ్యాంక్ వద్ద ఆందోళన చేస్తున్న డ్వాక్రా మహిళలు (ఫైల్)

తణుకు టౌన్: డ్వాక్రా మహిళల పొదుపు సొమ్ము కొంత మంది సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా దోపిడీకి గురవుతోంది. మహిళల్లో పొదుపు అలవాటును పెంచి వారి కుటుంబ అవసరాలకు ఉపయోగపడేలా గ్రూపుగా ఏర్పడి బ్యాంక్‌లో జమ చేసుకుంటే కొంతమంది మహిళలు యానిమేటర్లు, డ్వాక్రా సీఏలు, ఇతర సిబ్బంది తమవాటం ప్రదర్శించి సభ్యులకు తెలియకుండా వారి సొమ్మును ఇష్టానుసారం దోచేస్తున్నారు. తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలోని యూనియన్ బ్యాంక్‌లో డ్వాక్రా సంఘాల మహిళా సభ్యుల సొమ్మును డ్వాక్రా యానిమేటర్లు యథేచ్ఛగా దోచుకుంటున్నా అధికారులు, బ్యాంక్ సిబ్బంది పట్టనట్టు వ్యవహరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామంలో పది మంది సభ్యులతో డ్వాక్రా సంఘం ఏర్పాటు చేసుకుని, పది మంది నెలకు రూ.200 చొప్పున పొదుపు ఖాతాలో పొదుపు చేస్తారు. ఆ గ్రూపునకు సంవత్సరం సీనియారిటీ వచ్చిన తర్వాత పొదుపు చేసిన మొత్తానికి రెండు మూడు రెట్లు రుణంగా అందజేస్తారు. దీనిని ప్రతి నెలా బ్యాంక్‌కు తిరిగి చెల్లించాలి. డ్వాక్రా సంఘ సభ్యులు తమ గ్రూపుకు సంబంధించి రుణం తీసుకునే సమయంలో, తిరిగి చెల్లించే సమయంలో సభ్యులంతా సమావేశమై తీర్మానాలు చేసి ఆతీర్మానాల పత్రాలను బ్యాంక్ సిబ్బందికి చూపిస్తే వారు పరిశీలించి గ్రూపునకు రుణం మంజూరు చేయడం లేదా రుణానికి సంబంధించిన సొమ్మును బదలాయించాలి. అయితే దువ్వ గ్రామంలోని భాగ్యలక్ష్మి పరిధిలోని పలు గ్రూపులకు సంబంధించిన మినిట్స్ పుస్తకాలలో తీర్మానాలు చేశారు కానీ, సభ్యుల సంతకాలు లేవు. ఇలా సంతకాలు లేని మినిట్స్ చూసి సొమ్ములు ఎలా ఇచ్చారో అర్థంకాని ప్రశ్నగా ఉంది. అదే విధంగా డ్వాక్రా యానిమేటర్ భాగ్యలక్ష్మికి పరిధిలోని సభ్యుల పేరున ఉన్న సొమ్మును వేరే యానిమేటర్ గ్రూపులకు చెందిన సభ్యుల ఖాతాలకు బదలాయించి వారి బ్యాంక్ ఖాతాకు సంబంధించిన వారి చెక్కును తీసుకుని వారి పేరుతోనే డ్రా చేసినట్లు ఉంది. భాగ్యలక్ష్మి తన పరిధిలోని డ్వాక్రా గ్రూపులకు సంబంధించిన రికార్డులను తన వద్దే ఉంచుకుని ఎవరు అడిగినా వారి గ్రూపు రికార్డును వారికి ఇచ్చేది కాదని గ్రూపు లీడర్లు చెబుతున్నారు. రుణం తీసుకున్న డ్వాక్రా సభ్యులకు తిరిగి చెల్లించాలని తాఖీదులు అందడంతో ఈ స్కామ్‌కు సంబంధించిన డొంక కదలి యానిమేటర్ భాగోతం బయటపడిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

గతంలోనూ ఇలానే..

దువ్వ గ్రామంలోని యూనియన్ బ్యాంక్ శాఖకు ఈ భాగోతం కొత్త కాదని డ్వాక్రా మహిళలు మండిపడుతున్నారు. 2021 సంవత్సరంలో ముద్దాపురం గ్రామానికి చెందిన డ్వాక్రా యానిమేటర్ మంజులా రాణి తన పరిధిలోని 23 డ్వాక్రా గ్రూపులకు సంబంధించి రూ.17 లక్షలు స్వాహా చేసింది. అప్పట్లో ముద్దాపురం గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు తణుకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. అయితే కేసు విచారణలో ఉండగానే సదరు మంజులారాణి విదేశాలకు వెళ్లిపోయారు. ఆ తర్వాత గ్రామ పెద్దల జోక్యంతో ఆమె నుంచి సొమ్ములు రాబట్టి డ్వాక్రా మహిళల ఖాతాలకు జమ చేశారు.

నా చెక్కు నుంచి రూ.1 లక్ష తీసుకుంది



దువ్వ గ్రామానికి చెందిన డ్వాక్రా యానిమేటర్ భాగ్యలక్ష్మి బంధువులు నా బ్యాంక్ ఖాతాకు రూ.1 లక్ష జమ చేశారని, ఆ సొమ్మును తీసిస్తే ఒకేసారి రూ.లక్ష ఇవ్వరు, కాబట్టి నీ బ్యాంక్ చెక్కు ఇస్తే మొత్తం ఒకేసారి ఇస్తారని చెప్పి నాపేరుతో చెక్కును తీసుకున్నారు. అప్పట్లో నిజమే అని నమ్మి చెక్కు ఇచ్చా. ఇప్పుడు చూస్తే ఆమె పరిధిలో డ్వాక్రా గ్రూపునకు చెందిన సొమ్మును నా బ్యాంక్ ఖాతాలో వేసి నా ఖాతా నుంచి చెక్కు ద్వారా తీసుకున్నట్లు తెలిసింది.

– షేక్ సిలార్ బీబీ, డ్వాక్రా మహిళ, దువ్వ

సంతకాలను పరిశీలించాలి

డ్వాక్రా మహిళలు తమ బ్యాంక్ ఖాతా నుంచి సొమ్ము తీసుకునే సమయంలో తీర్మానం కాపీలో సంతకాలు, బ్యాంక్ విత్‌డ్రా పత్రంపై సంతకాలను బ్యాంక్ సిబ్బంది సరి చూడాలి. అంతేకాక గ్రూపు లీడర్లు ముగ్గురూ వచ్చారా? లేక ఒకరే తీసుకుంటున్నారా? అనే విషయాలు పరిశీలించాలి. గ్రూపునకు సంబంధం లేకుండా ఇలా యానిమేటర్లు సంతకాలు చేసి తీసుకువచ్చే విత్ డ్రా ఫారాలను ఒకటికి రెండు సార్లు బ్యాంక్ సిబ్బంది పరిశీలించాలి.

– టీ మధులత, డ్వాక్రా సీసీ, తణుకు

10 రోజుల్లో రికవరీ చేస్తాం



దువ్వ గ్రామంలో డ్వాక్రా మహిళల బ్యాంక్ ఖాతాల నుంచి తన సొంత ఖాతాలకు నిధులు మళ్లించుకున్న డ్వాక్రా యానిమేటర్ భాగ్యలక్ష్మి తన పరిధిలోని డ్వాక్రా గ్రూపుల సభ్యుల నుంచి రూ.26 లక్షల 45 వేలు స్వాహా చేసినట్లు గుర్తించాం. దువ్వ గ్రామంలోని డ్వాక్రా మహిళల బ్యాంక్ లావాదేవీలను పరిశీలించి పూర్తిస్థాయి విచారణ చేస్తాం. పది రోజుల్లో మహిళల సొమ్మును వారి ఖాతాలో జమ చేయిస్తాం. బాధ్యులపై కేసులు నమోదు చేసి చర్యలకు సిఫార్సు చేస్తాం.

– వేణుగోపాల్, జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్, భీమవరం

మాదిగలను తాకట్టు పెడుతున్న మందకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న మంగరాజు

గణపవరం: రాజ్యాంగ నిర్మాత, దళితుల ఆరాధ్య దైవం డా.బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడలలో నడవాల్సిన ఎంఆర్‌పీఎస్ నేత మందకృష్ణమాదిగ దళితులను తాకట్టు పెడుతున్నారని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు విమర్శించారు. వెంకట్రాజపురంలో గురువారం జరిగిన మండల మాలమహానాడు సర్వసభ్యసమావేశంలో ఆయన మాట్లాడారు. మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని తిరగరాస్తామని ప్రకటించిన బీజేపీకి మందకృష్ణమాదిగ మద్దతు ప్రకటించడం దారుణమన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే ఏంజరుగుతుందో అవ్వాతాతలకు పింఛను సొమ్ము సకాలంలో అందకుండా వలంటీర్లపై కోర్టు కేసులు, ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదులు చేయించడంతో బట్టబయలైందన్నారు. సకాలంలో పింఛను అందక లక్షలాది మంది దళిత వృద్ధులు ఇబ్బందులు పడటానికి చంద్రబాబే కారణమని, అలాంటి కూటమికి గుణపాఠం చెప్పడానికి దళితులంతా ఏకంకావాలని పిలుపు ఇచ్చారు. వచ్చే ఎన్నికలలో కూటమిని ఓడించి, సంక్షేమపాలకుడు వైఎస్ జగన్‌ను అధికారంలోకి తీసుకురావడానికి పేదలంతా కంకణబద్ధులు కావాలని ఆయన కోరారు. బాలకృష్ణ, పరమేశ్వరరావు, గోపి, సునీల్ పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు గురువారం ఇద్దరు భక్తులు రూ.1,50,232 విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన నెమల రాము రూ.1,00,116, కలరాయన గూడెంకు చెందిన ఎం.వెంకట సత్యనారాయణ రూ.50,116 ఆలయ కార్యాలయంలో జమచేశారు.

ప్రపంచ దేశాలకు దీటుగా భారత్

డీఆర్‌డీఓ విశ్రాంత డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి



ఏపి నిట్‌లో కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌డీఓ విశ్రాంత డైరెక్టర్ జి.మధుసూదనరెడ్డి

తాడేపల్లిగూడెం: ప్రపంచ దేశాలకు దీటుగా భారత్ దూసుకెళుతోందని ఏపీ నిట్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిఫెన్స్ మెటలర్జికల్ రీసెర్చ్ లాబోరేటరీ డీఆర్‌డీఓ విశ్రాంత డైరెక్టర్, శాస్త్రవేత్త డాక్టర్ జి.మధుసూదనరెడ్డి చెప్పారు. మెటీరియల్స్ ఫర్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ అప్లికేషన్స్ అనే అంశంపై ఆయన అవగాహన కల్పించారు. దేశభద్రత, నిఘా వ్యవస్థకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. ఏరోస్పేస్, డిఫెన్సు రంగాలకు సంబంధించిన పరికరాలను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయికి భారత్ ఎదిగిందన్నారు. డీఆర్‌డీఓ విశ్రాంత అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ వీవీ సత్యప్రసాద్ మాట్లాడుతూ అంతరిక్షంలో ప్రయోగించే వాహనాల్లో అధిక ఉష్ణోగ్రతను తట్టుకునే నూతన లోహాలపై స్వదేశీ పరిజ్ఞానంతో విస్తృత పరిశోధనలు సాగుతున్నాయన్నారు. విద్యార్థులు కూడా ఆ దిశగా ఆలోచనలు చేయాలన్నారు. మెటీరియల్స్ ఇంజనీరింగ్‌ను అన్వేషించడం, పరిశోధనల సారాంశం, అప్లికేషన్స్ ఆవశ్యకత, ఏరోస్పేస్ అప్లికేషన్ల కోసం అధిక ఉష్ణోగ్రత మెటీరియల్స్ వంటి అంశాలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. వక్తలను ఘనంగా సత్కరించారు. ఎంఎంఈ విభాగాధిపతి రఫీ మహమ్మద్,ఆచార్యులు సునీల్ కుమార్, కిరణ్ తీపర్తి, వి.సందీప్ పాల్గొన్నారు.

భీమవరంలో జనసేనకు ఆదిలోనే హంసపాదు

- ఉదయం పార్టీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం
- సాయంత్రానికి అనుమతులు లేవంటూ జెండాలను తొలగించిన అధికారులు



భీమవరంలో జనసేన ఎన్నికల కార్యాలయం ప్రారంభోత్సవం సమయంలో ఏర్పాటు చేసిన కూటమి జెండాలు



జెండాలను తొలగించడంతో బోసిపోయిన కార్యాలయం

భీమవరం: భీమవరంలో జనసేన పార్టీకి ఆదిలోనే హంసపాదు ఎదురైంది. గురువారం ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన ఎన్నికల కార్యాలయాన్ని అనుమతులు లేవంటూ అధికారులు కన్నెర్ర చేసి జెండాలను తొలగించారు. దీంతో ఉదయమంతా పార్టీ శ్రేణులతో కోలాహలంగా ఉన్న కార్యాలయం కనీసం ఆరుగంటలైన గడవకముందే వెలవెలబోయింది. వివరాల్లోకి వెళితే.. కూటమి పొత్తులో భాగంగా భీమవరం టికెట్‌ను జనసేనకు కేటాయించగా ఇక్కడ అభ్యర్థిగా టీడీపీ మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) ఎంపిక చేశారు. అంజిబాబు గత ఐదేళ్లుగా రాజకీయాలకు దూరంగా ఉండడంతో ఆయన ఎంపికపై జనసేన, టీడీపీ నాయకులు గుర్రుగా ఉన్నారు. ఇటువంటి సమయంలో అందర్ని కలుపుకుని వెళ్లడానికి అంజిబాబు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి ఎన్నికల కార్యాలయాన్ని పట్టణంలోని ఎడ్వర్డ్‌ట్యాంక్ వద్ద ఉన్న ఖాళీస్థలంలో ఏర్పాటు చేశారు. ఎన్నికల కార్యాలయాన్ని జనసేన, టీడీపీ, బీజేపీ జెండాలతో అలంకరించారు. కార్యాలయం ప్రారంభోత్సవానికి గురువారం ఉదయం 9.11 ముహూర్తంగా నిర్ణయించి అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

ముందస్తు అనుమతులు లేకుండానే..

ఎన్నికల నిబంధనల ప్రకారం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించాలంటే ముందస్తు అనుమతులు తప్పనిసరి. అయితే గురువారం ఉదయం పార్టీ కార్యాలయం ప్రారంభించే సమయానికి మునిసిపల్ అధికారులు అక్కడికి చేరి అనుమతులేవంటూ ప్రశ్నించారు. అదిగో వస్తున్నాయి.. ఇదిగో వస్తున్నాయంటూ పార్టీశ్రేణులు కాలయాపన చేశారు. సాయంత్రం వరకు వేచిచూసిన అధికారులు అనుమతులు చూపించకపోవడంతో పార్టీల జెండాలను తొలగించారు. దీంతో ఉదయమంతా ఎంతో కోలహలంగా ఉన్న కార్యాలయం సాయంత్రం జెండాలు, జనం లేక వెలవెలబోయింది. అన్ని తెలిసి అనుమతులు లేకుండా ఎలా ప్రారంభించారంటూ పార్టీ శ్రేణులే నివ్వెరపోవడమేగాక ఆదిలోనే హంసపాదు ఎదురైందంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దుష్ప్రచారం తట్టుకోలేకే వలంటీర్ల రాజీనామాలు



ఉనికిలిలో రాజీనామా పత్రాలను సెక్రటరీకి అందజేస్తున్న వలంటీర్లు



అంబర్‌పేటలో రాజీనామా పత్రాలను చూపుతున్న వలంటీర్లు

అత్తిలి : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ సేవ చేస్తున్న వలంటీర్‌ల ప్రతిష్ఠను దెబ్బ తీసేలా ప్రతిపక్షపార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తట్టుకోలేక వలంటీర్ కొలువులకు స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నామని వలంటీర్లు ఆవేదనగా చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో గ్రామాల్లో వలంటీర్ల రాజీనామాలు గురువారం కొనసాగాయి. అత్తిలి మండలంలోని పలు గ్రామాల్లో వలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి రాజీనామా పత్రాలను ఆయా గ్రామ కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు సేవచేసే అవకాశం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని, అయితే ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్ష పార్టీలవారు వలంటీర్లను ఉగ్రవాదులుగా పోల్చడాన్ని తట్టుకోలేక తమ ఉద్యోగాలకు రాజీనామా చేస్తున్నామని తెలిపారు. నేడు చంద్రబాబు చేస్తున్న దుర్మార్గపు రాజకీయాలకు పింఛనుదారులు సచివాయల వద్ద పడిగాపులు పడుతూ అనేక ఇబ్బందులు పడుతుండటాన్ని చూసి మనస్సు చలించి వలంటీర్ కొలువులకు స్వచ్ఛందంగా రాజీనామా చేశామని వెల్లడించారు. ఆరవల్లిలో 25 మంది, అత్తిలిలో 52, ఉరదాళ్లపాలెంలో నలుగురు, బల్లిపాడులో 23, గుమ్మంపాడులో 11, లక్ష్మీనారాయణపురంలో 15 మంది, ఉనికిలిలో 15 మంది, కొమ్మరలో 15, పాలూరులో ఒకరు, తిరుపతిపురంలో 17 మంది వలంటీర్లు రాజీనామా చేశారు.

భీమడోలు మండలంలో..

భీమడోలు : అంబర్‌పేటలో 14 మంది వలంటీర్లు గురువారం స్వచ్ఛందంగా మూకుమ్మడి రాజీనామాలు చేశారు. రాజీనామా పత్రాలను గ్రామ పంచాయతీ కార్యనిర్వాహక కార్యదర్శి వెంకట్రావుకు అందజేశారు. రాజకీయాలకుతీతంగా నిస్వార్థ సేవలందిస్తున్న తమపై టీడీపీ కక్షసాధింపు చర్యలకు పూనుకుని వలంటీర్ వ్యవస్థపై విషం కక్కుతుందని వాపోయారు. పేదలకు సేవ చేసే అవకాశం లేనప్పుడు ఉచితంగా పారితోషకాలను తీసుకోవడం సబబు కాదని, అందుకే స్వచ్ఛందంగా తప్పుకుంటున్నామని తెలిపారు.

వీరవాసరంలో..

వీరవాసరం : మండల వ్యాప్తంగా 100 మంది వలంటీర్లు గురువారం స్వచ్ఛందంగా రాజీనామాలు సమర్పించారు. ఆయా గ్రామాల్లోని గ్రామ సచివాలయ కార్యదర్శులకు రాజీనామా పత్రాలను అందజేశారు. అవ్వాతాతలకు పెన్షన్‌తో పాటు ప్రజలకు ఏ అవసరం వచ్చినా ముందుండి సేవలందించామన్నారు.

టీడీపీ ఫ్లెక్సీ తొలగింపుపై ఉద్రిక్తత

సాక్షి స్పందన



టీడీపీ కార్యాలయం వద్ద ఫ్లెక్సీని తొలగించడానికి వెళ్లిన ఎంసీసీ టీమ్

నూజివీడు: నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ తాత్కాలిక కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగించేందుకు వెళ్లిన ఎన్నికల అధికారులను, సిబ్బందిని టీడీపీ కార్యకర్తలు అడ్డుకుని వాగ్వివాదానికి దిగడంతో కొంత సేపు ఉద్రిక్తత నెలకొంది. నూజివీడులోని విజయవాడ రోడ్డులో ఈనెల 3న టీడీపీ తాత్కాలిక కార్యాలయాన్ని ప్రారంభించారు. అయితే కార్యాలయ ప్రహరీకి బయట భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీనిపై 'టీడీపీ ఆఫీసుకు ఎన్నికల కోడ్ వర్తించదా?' అనే శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఆర్డీఓ, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వై.భవానీశంకరి దృష్టికి ఈ విషయం వెళ్లగా, ఆమె అంతకు ముందు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేసి, ఫ్లెక్సీని తొలగించాలని ఎంసీసీ టీమ్‌కు ఆదేశాలు జారీచేశారు. దీంతో సాయంత్రం ఎంసీసీ సిబ్బంది పోలీసు బందోబస్తుతో ఫ్లెక్సీని తొలగించేందుకు వెళ్లగా కొందరు టీడీపీ కార్యకర్తలు అడ్డుకుని వారితో వాగ్వివాదానికి దిగారు. మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి, ఆర్డీఓ వై.భవాని శంకరి ఘటనా స్థలానికి చేరుకుని భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదని స్పష్టం చేయగా, ఫ్లెక్సీని తొలగిస్తామని ఆర్డీఓకు తెలిపారు. దీంతో పరిస్థితి సద్దుమణిగింది.

క్లుప్తంగా

ప్రతి కుటుంబానికీ సంక్షేమ లబ్ధి



ఒకటవ వార్డులో ప్రచారం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్: ప్రతి కుటుంబానికి సంక్షేమం అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొట్టు తనయుడు రాజేష్, కుమార్తె కాంచన తెలిపారు. గురువారం 1వ వార్డులో ఇంటింటికీ వైఎస్సార్ సీపీ ప్రచారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణను గెలిపించాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా కొట్టు సత్యనారాయణను గెలిపించాలని కోరారు. ప్రతి ఇంటికి సంక్షేమం అందాలన్నా, అభివృద్ధి చెందాలన్నా రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో కొట్టు సత్యనారాయణను ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అడ్డాల నర్సింహారావు, బోణం విజయనిర్మల, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డైమండ్స్ సేవలు అభినందనీయం



అంగన్‌వాడీకి కుర్చీలు అందజేస్తున్న డైమండ్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): డైమండ్స్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. లయన్స్‌క్లబ్ కోశాధికారి మునగాల జితేంద్ర సాయంతో గర్భిణులు కూర్చువడానికి అవసరమైన ఫైబర్ కుర్చీలను స్థానిక సుబ్బారావుపేట అంగన్‌వాడీ సెంటర్‌కు బహుకరించారు. అంగన్‌వాడీ టీచర్ సత్యవతి క్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జామి సత్యనారాయణ, కలవలపల్లి సత్యనారాయణ, భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య అంగన్‌వాడీ పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

నేడు కోదండరామ స్వామి దేవాలయం పునః ప్రతిష్ఠ



నూతన రామాలయం నిర్మిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో చలంచర్ల వీధిలో నూతనంగా నిర్మించిన కోదండరామ స్వామి దేవాలయంలో ఈ నెల 5వ తేదీ శుక్రవారం ఉదయం శ్రీ మహాలక్ష్మి, శ్రీనివాస సహిత శ్రీ హనుమాన్ సీతా లక్ష్మణ సమేత శ్రీ కోదండ రామచంద్రస్వామి మూల మూర్తి, ఉత్సవ, బింబ, శిఖర, గరుడాంజనేయ సహిత ఆలయ ధ్వజ, ద్వార పాలక జయ, విజయ యంత్ర పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ పూజలకు భద్రాచల దేవస్థానం ఉప ప్రధానాచార్యులు కోటి రామ స్వరూప్ ఆచార్య స్వామి బ్రహ్మత్వం వహించనున్నారు. ధర్మకర్త నారాయణ వెంకట రమణ రావు, శ్రీదేవి దంపతులచే విశేష పూజలు జరగనున్నాయి. గురువారం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. అలంకరణలు గావించారు. భక్తులు పాల్గొని, స్వామి వారిని దర్శించాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భీమవరం ప్రాంతంలో ప్రధాన కూడలిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరడంతో భీమవరం అన్నపూర్ణ అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం మార్కెట్ వాటర్ ట్యాంక్ వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ శ్యామల అన్నారు. ఈ మేరకు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం బుధవారం మార్కెట్లో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ శ్యామల, ఏఎమ్ ఈ శ్రీనాథ్, డిఈ నారాయణరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ అన్నపూర్ణ అన్నదాన ట్రస్ట్ కార్యనిర్వాకులు తమిరి శరత్ మాట్లాడుతూ వేసవికాలం పేదల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కొన్ని సంవత్సరాలుగా ఈ చలివేంద్రం ఈ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నామని ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేసవికాలంలో వృద్ధులు, చిన్నారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పక్కాగా వాహనాల తనిఖీలు

ఉండి: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా మండలంలో నిర్వహిస్తున్న విధుల్లో భాగంగా వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహిస్తున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఈఓపీఆర్‌డీ రెడ్డి, ఏఎస్సై ఆకురాతి సూర్యనారాయణ తెలిపారు. గురువారం ఉండి సెంటర్‌లో వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి వాహనాన్ని పూర్తిస్థాయిలో తనిఖీ చేస్తున్నారు.

మండుటెండలో పండుటాకులు

- పింఛన్ల కోసం సచివాలయాల వద్ద అవ్వాతాతల అవస్థలు
- చంద్రబాబు నాటి చీకటి రోజులు గుర్తు చేసుకుంటున్న లబ్ధిదారులు



తణుకు టౌన్: వేల్పూరు 1వ సచివాలయంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

తణుకు అర్బన్: టీడీపీ నేత చంద్రబాబు కుట్రపూరితంగా వ్యవహరించి వలంటీర్లను పింఛను పంపిణీకి అడ్డుకున్న నేపథ్యంలో పింఛనదారుల కష్టాలు గురువారం కూడా కొనసాగాయి. తణుకు పట్టణంలోని సచివాలయాల వద్దకు ఉదయం నుంచే పింఛన్ దారులు భారీగా చేరుకున్నారు. దూరాభారంతో పాటు నడవలేని స్థితిలో సైతం పింఛను కోసం పింఛన్ దారులు సచివాలయాలకు రావాల్సిన దుస్థితి నెలకొంది. 1వ తేదీ తెల్లవారుజామునే ఇంటిగుమ్మంలోకి వలంటీరు పింఛన్ తీసుకువచ్చే పరిస్థితుల నుంచి మళ్లీ టీడీపీ ప్రభుత్వ హయాంలోని పాత పద్ధతిలో పింఛన్లు తీసుకోవాల్సి రావడంతో పింఛన్ దారులు గగ్గోలుపెడుతున్నారు. అవ్వా, తాతలు కొందరు తమ మనుమలు, ఇతరుల సహకారంతో సచివాలయాలకు చేరుకోగా ఎవరూ లేని వారు మాత్రం ఒంటరిగానే నడవలేక తూలుతూ సచివాలయ కేంద్రాల వద్దకు చేరుతున్న తీరు బాధాకరంగా మారింది. చంద్రబాబు తాను ఉన్నప్పుడు ఏమీ చేయలేకపోయాడని ఇప్పుడు జగన్ ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలను సైతం అడ్డుపడుతున్నాడని పలువురు విమర్శిస్తున్నారు. చంద్రబాబు ఇంతకంటే మమ్మల్ని ఇంకేమి చేయగలడంటూ పింఛన్ దారులు శాపనార్థాలు పెడుతున్నారు.

సచివాలయాల వద్ద సౌకర్యాలు..

ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు వలంటీర్లు పింఛన్ పంపిణీకి దూరంగాఉన్న పరిస్థితుల్లో పింఛన్ దారుల సౌకర్యార్థం ప్రభుత్వం సచివాలయాల వద్ద సౌకర్యాలను కల్పించింది. టెంట్‌లువేసి కుర్చీలు అందుబాటులో ఉంచారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. సచివాలయాల వద్ద బుధవారం రాత్రి 9 గంటల వరకు పింఛన్లు అందించగా, మళ్లీ గురువారం ఉదయం 6 గంటల నుంచే పింఛను పంపిణీ ప్రక్రియ కొనసాగింది.



తణుకు అర్బన్: ఆటోలో వచ్చి పింఛన్ తీసుకుంటున్న వృద్ధుడు



తాడేపల్లిగూడెం రూరల్: వట్టింపాలెం సచివాలయంలో పింఛన్ల పంపిణీ చేస్తున్న దృశ్యం

పింఛన్ల పంపిణీ 80శాతం పూర్తి

తణుకు టౌన్: మండలంలో గురువారం సాయంత్రానికి 80శాతం పింఛన్లపంపిణీ కార్యక్రమం పూర్తయిందని ఎంపీడీవో శ్రీలలిత తెలిపారు. మండలంలోని వివిధ సచివాలయాల పరిధిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ముమ్మరంగా చేపట్టారు. వృద్ధులు, వికలాంగులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా సచివాలయ సిబ్బంది అన్ని వసతులు ఏర్పాటు చేశారు.

శరవేగంగా పింఛన్ల పంపిణీ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం శరవేగంగా జరుగుతుంది. ఈ నెల 3వ తేదిన పింఛన్లకు సంబంధించి మూడు గ్రామ సచివాలయాలకు నిధులు జమ కావడంతో పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. గురువారం మిగిలిన గ్రామాలకు పింఛన్ల సొమ్ము జమ కావడంతో చురుగ్గా పంపిణీ కార్యక్రమం జరిగింది. మండలంలో మొత్తం 12,775మందికి వివిధ రకాల పింఛన్లు పంపిణీ చేయవలసి ఉండగా, గత రెండ్రోజుల్లో 9,235 మందికి పంపిణీ చేశారు. తద్వారా 74.86 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు ఎంపీడీవో ఎస్.సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు. పట్టింపాలెం గ్రామ సచివాలయంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పింఛన్ల కోసం వచ్చిన వృద్ధులు, వితంతువులు, వికలాంగుల సౌకర్యార్థం ఆయా సచివాలయాల వద్ద కుర్చీలు, మంచినీరు, వైద్య శిబిరాలు వంటి వాటిని ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఇంటి వద్దే పింఛన్ ఇప్పించే ఏర్పాటు చేయాలి



ఇంటి వద్ద నుంచి ఎండలో రావడం చాలా ఇబ్బందిగా ఉంది. వయస్సు పైబడటంతో రాలేకపోతున్నాం. వచ్చే నెల నుంచి ఇంటి వద్దే పింఛన్ ఇప్పించే ఏర్పాటు చేయాలి.

– కట్టా లక్ష్మి, నీలాద్రిపురం, తాడేపల్లిగూడెం మండలం

నూతన వంగడాల సాగు పరిశీలన



కుప్పనపూడిలో నూతన వంగడం పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఆకివీడు: ఎంటీయూ 1293, 1273 వంగడాల మినీ కిట్ల సాగు అద్భుతంగా ఉందని కేవీకే శాస్త్రవేత్త ఎన్.మల్లికార్జునరావు చెప్పారు. మండలంలోని కుప్పనపూడి గ్రామంలో ఆదర్శ రైతు నంద్యాల చల్లారావు మినీ కిట్ల వంగడాలను సాగు చేశారు. రబీ పంటను పరిశీలించిన మార్టేరు, కేవీకే శాస్త్రవేత్తల బృందం సంతృప్తి వ్యక్తం చేశారు. శాస్త్రవేత్త మల్లికార్జునరావు మాట్లాడుతూ 120–122 రోజుల కాలపరిమితిలో పంట సాగు పూర్తి అవుతుందని చెప్పారు. దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని, గింజ పొడవు, సన్నం కలిగి ఉండడం వల్ల ప్రజలు భుజించడానికి అవకాశం ఉంటుందన్నారు. పంట సాగులో ఎలాంటి తెగుళ్ల ఆశించలేదన్నారు. ఎంటీయూ 1010 వంగడాన్ని పోలి ఉందని చెప్పారు. జిల్లాలో మార్టేరు, ఉండి కేవీకే, మత్స్యపురి, సీసలి, కుప్పనపూడి తదితర ప్రాంతాల్లో కొత్త వంగడం సాగుకు మినీ కిట్లు అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మార్టేరు శాస్త్రవేత్త, డాక్టర్ డీ. శ్రీనివాస్, కృష్ణాజీ, దయాళ్ ప్రసాద్, సునీత, వీ.వినయ్ లక్ష్మి, మండల వ్యవసాయాధికారిణి ఎమ్మార్పీ ప్రియాంక, లావణ్య, ఆదర్శ రైతు నంద్యాల చల్లారావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో జనసేన నేత సాయిరాం చేరిక



తణుకులో జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన పెద్దిరెడ్డి సాయిరాంతో మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: జనసేన పార్టీ అత్తిలి మండల కార్యదర్శి పెద్దిరెడ్డి సాయిరాం మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో సాయిరాంకు మంత్రి కారుమూరి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ పేదల పక్షపాతిగా జగన్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం చూసి పార్టీలోకి టీడీపీ, జనసేన నుంచి అధికశాతం చేరికలు జరుగుతున్నాయని అన్నారు. వారందరినీ సొంత కుటుంబ సభ్యులుగా చూసుకుంటామని చెప్పారు. సాయిరాం మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వైఎస్సార్ సీపీ ద్వారానే ప్రజలకు మేలు చేయగలమని అన్నారు. జగనన్న సంక్షేమ పరిపాలనతో పాటు మంత్రి కారుమూరి మీద ఉన్న అభిమానంతో వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వివరించారు. ఆయనతోపాటు మరొక జనసేన సానుభూతిపరుడు గరగ స్వామి పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్ధరాతి భరణిప్రసాద్, కానూరి శ్రీనివాస్, యడ్లపల్లి దుర్గారావు, కూనపరెడ్డి జయరాజు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



వార్డుల్లో ర్యాలీ చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వీకర్స్ కాలనీ పరిధిలో 1, 2 వార్డుల్లో ఆరోగ్య కార్యక్రమాలు, వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలు గురువారం క్షేత్రస్థాయిలో జరిగాయి. వార్డుల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలలో అవగాహన కల్పిస్తు ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ వైద్య బృందాలు ఫీవర్ సర్వేలు చేయాలని, ప్రజలకు ఆరోగ్య అవగాహన చేయాలని పలు సూచనలు చేశారు. కాలానుగుణ వ్యాధుల పట్ల ప్రజలు ఎటువంటి ఆందోళన, అపోహలు వద్దని, అవగాహనతో వ్యవహరించాలని, అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు జయ, మేరీ, జ్యోతి, ఆరోగ్య సహాయకులు కాంతారావు, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణ అందరి బాధ్యత

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజారోగ్య పరిరక్షణ మనందరి బాధ్యత అని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. గురువారం మండలంలోని ఆరుళ్ళ, నందమూరు గ్రామాల్లో వెక్టార్ కంట్రోల్, హైజీన్, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. దోమలు పుట్టకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం గ్రామంలోని పాఠశాలలను సందర్శించి, విద్యార్థులకు కీటక జనీత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆరోగ్య కార్యకర్తలు సరళ, దీవెన, కాంతారావు, రాజు పాల్గొన్నారు.

ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం



మీనవిల్లూరులో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి ఉమాబాల, తదితరులు

పెంటపాడు: ఇచ్చిన మాటకు కట్టుబడి గడిచిన 58నెలల్లో సంక్షేమ పాలన అందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని త్వరలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాఆశీర్వదంతో మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని నర్సాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల పేర్కొన్నారు. శుక్రవారం ఆమె పెంటపాడు మండలం మీనవిల్లూరు, రామచంద్రపురం, బి. కొండేపాడు, చింతపల్లి గ్రామాలతో పాటు , కోరిమిల్లి గ్రామాల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సాపురం ఎంపీ అభ్యర్థి స్థానానికి ఎంతో మంది ఉద్దండులు ఉన్నా సామాన్యురాలినైన తనను జగనన్న ఎంపిక చేశారన్నారు. జగనన్న సంక్షేమ పథకాలే ప్రజలకు శ్రీరామరక్ష అని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఈ సందర్భంగా మీనవిల్లూరులో పలువురు పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. కొండేపాడులో మాజీ ఎంపీటీసీ సభ్యులు పాలా గణపతి దంపతులు ఎంపీ అభ్యర్థిని ఉమాబాలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, గుండుమోగుల సాంబయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పులూరి వరలక్ష్మి, వల్లూరి బ్రహ్మానందం, ములగాల బాబ్జి, చల్లా లింగమూర్తి, కుమారస్వామి, దేవరశెట్టి రాంబాబు, మిరియాల శేషు, వైస్‌ఎంపీపీ ముప్పిడి సరోజిని, పలు గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

బీవీఆర్‌లో ఉగాది గౌరవ పురస్కారాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో ఈ నెల 9వ తేదీన మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి కళాకారులచే నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం నిర్వహించనున్నట్లు బీవీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు తెలిపారు. సీనియర్ న్యాయవాది గొల్లపూడి వెంకట ద్వారాకానాథ్, రచయిత వేమూరి శ్రీనివాస్‌కు, మహిళా కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ మాడభూషి జ్యోతి కుమారి, లయన్స్‌క్లబ్ జోన్‌ఛైర్‌పర్సన్ రత్నకుమారికి, ఎం.కృష్ణకుమారికి ఉగాది పురస్కారాలు అందజేస్తారని తెలిపారు. ఆర్థిక సత్కారంతో పాటు పంచాంగ పఠనం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

జగనన్నతోనే రాష్ట్రానికి మేలు



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే మన రాష్ట్రానికి మేలు జరుగుతుందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు కొనియాడారు. పట్టణంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో అన్ని హామీలను అమలు చేసి, నేడు మేము సిద్ధమని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్ర చేస్తున్నారని, ఆయనకు వేలాదిగా ఘన స్వాగతం పలుకుతున్నారని తెలిపారు. అభివృద్ధితో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు, అగ్రవర్ణ పేదలకు సైతం సంక్షేమాలు అమలు చేస్తూ ధైర్యంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల్లోకి వెళ్లుతున్నారని చెప్పారు. అయితే చంద్రబాబుకు 14 సంవత్సరాల పాటు అధికారంలో ఉండి అభివృద్ధి, సంక్షేమం మర్చిపోయారని విమర్శించారు. ఇది ఇలా ఉంటే పవన్ కల్యాణ్ పార్టీ పెట్టి 11 సంవత్సరాలు అయ్యిందన్నారు. గెలిచిన ఒక్క ఎమ్మెల్యే సైతం వైఎస్సార్ సీపీలో చేరారన్నారు. నేడు భీమవరం, గాజువాకలో ఓడిపోతారనే భయంతో పిఠాపురంలో కాపు సామాజిక వర్గం ఎక్కువ ఉందని, అక్కడ నుంచి పోటీ చేయడం వల్ల గెలుస్తానని అనుకోవడం హాస్యస్పదంగా ఉందన్నారు. ఒక అధ్యక్షుడిగా ఉంటూ పవన్ కల్యాణ్ 175 నియోజకవర్గాలలో ఎక్కడ నుంచి అయినా పోటీ చేసే సత్తా కలిగి ఉండాలన్నారు. ప్యాకేజీ స్టార్‌గా ఉంటూ చంద్రబాబు విజయానికి కృషి చేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మాధ్యమ బోధన భేష్

- ఉన్నత విద్యలో ఇంగ్లీషు మాధ్యమం సత్ఫలితాలనిస్తోంది
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లితండ్రులు



తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల

తణుకు అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను కూడా ఉన్నత స్థాయికి చేర్చాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన ఇంగ్లీషు మాధ్యమం బోధన సత్ఫలితాలనిచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం ఇంగ్లీషు మాధ్యమాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చిన రోజు నుంచి విద్యార్థుల స్థితిగతులే మారిపోయాయి. పాఠశాలల్లో ఇంగ్లీషు పరిజ్ఞానం ఉన్న ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నప్పటికీ గత ప్రభుత్వాలు ఈ దిశగా ఆలోచన చేయకపోవడంతో విద్యార్థులు ఇంగ్లీషు మాట్లాడడంలో వెనుకబడి ఉన్నత విద్య అభ్యసనలో కూడా ఇబ్బందులు పడే పరిస్థితులు ఉండేవి. ఈ సమస్యను గుర్తించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఇంగ్లీషు మాధ్యమాన్ని విస్తృతం చేయాలనే సదుద్దేశ్యంతో విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఇంగ్లీషు మాధ్యమాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో ఇప్పటికే పాఠశాలల నుంచి బయటకు వెళ్లిన విద్యార్థులు ఇంటర్మీడియేట్, ఇంజనీరింగ్ విద్యలో ఇంగ్లీషు భాషపై పట్టు సాధించారు. దీంతో అంతర్జాతీయ సెమినార్‌లలో సైతం ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొని ధారాళంగా ఇంగ్లీషు భాషలో మాట్లాడిన వైనం మనకు తెలిసిందే.

ఇంగ్లీషుపై పట్టు సాధిస్తున్న విద్యార్థులు

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులు కూడా ఇంగ్లీషు భాషపై పట్టు సాధించాలనే దృఢసంకల్పంతో పట్టువిడవకుండా ఇంగ్లీషు మాధ్యమాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి పాఠ్యాంశ పుస్తకాలను సైతం ఇంగ్లీషులో ముద్రింపచేశారు. అంతే కాకుండా నాడు నేడు నిధులతో పాఠశాలల రూపురేఖలు మార్చి విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించడంతో ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ పెరిగింది. ఇందుకు నిదర్శనంగా తణుకు నియోజకవర్గంలోని తణుకు మునిసిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి 2014–19 సంవత్సరంలో నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య14,489 ఉండగా, నేడు ఆ సంఖ్య 15811కు పెరిగింది. విద్యార్థుల తల్లి తండ్రులు సైతం ఇంగ్లీషు మాధ్యమాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటుచేసినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంతర్జాతీయ స్థాయికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించడంతో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అమెరికా వంటి దేశాల్లో నిర్వహించిన అంతర్జాతీయ సెమినార్‌లలో సైతం పాల్గొన్నారు. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రమే అందుబాటులో ఉండే ఇంగ్లీషు మాధ్యమ విద్యను ప్రభుత్వ పాఠశాలల్లోకూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రతిపక్షనేతలు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మాధ్యమం వద్దంటూ రాద్ధాంతం చేసినా సీఎం జగన్ పట్టు వదలకుండా ఇంగ్లీషు మాధ్యమాన్ని ప్రవేశపెట్టారు. దీంతో ఇటు విద్యార్థులు, అటు తల్లితండ్రులుకూడా సీఎం జగన్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి

ఇంగ్లీషు విద్య మంచి నిర్ణయం



పేద విద్యార్థులు ఉండే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు బోధన చేయాలనేది చాలా మంచి నిర్ణయం. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇంగ్లీషు మాధ్యమం అందుబాటులోకి తీసుకురావడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తు మారింది. ఉన్నత స్థాయి విద్యకు నేటి ఇంగ్లీషు బోధన మంచి పునాదిగా నిలబడుతోంది.

– పెన్మెత్స రామరాజు, రిటైర్డు పాఠశాలల ఉప తనిఖీ అధికారి, గుమ్మంపాడు

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా



ఇంగ్లీషు బోధన అంటే గతంలో ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు మాత్రమే అందుబాటులో ఉండేది. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇంగ్లీషు మాధ్యమాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఇంగ్లీషులో ధారాళంగా మాట్లాడుతున్నారు.

– ఎన్వీ జాకబ్‌బాబు, రిటైర్డు ప్రధానోపాధ్యాయులు, తణుకు

ఇంగ్లీషులో మాట్లాడగలుగుతున్నాం



మా పాఠశాలలో ఇంగ్లీషు బోధన అందుబాటులోకి రావడంతో విద్యార్థులంతా ఇంగ్లీషు భాషపై పట్టు సాధించాము. ఉపాధ్యాయులు ఇంగ్లీషులో చెబుతున్న పాఠ్యాంశాన్ని అర్థం చేసుకోవడమే కాకుండా ఇంగ్లీషులో మాట్లాడడం కూడా అలవాటైంది. రేపటి ఉన్నత స్థాయి విద్యకు నేటి ఇంగ్లీషు బోధన చాలా బాగా సద్వినియోగపడుతుంది.

– కత్తుల యువల్ తేజ, 8వ తరగతి విద్యార్థి, జాస్తి సీతామహాలక్ష్మి బాలికోన్నత పాఠశాల, తణుకు

సైన్స్‌తో విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలు



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న దృశ్యం

భీమవరం: విద్యార్థుల్లో వినూత్న ఆలోచన శక్తిని పెంపొందించేందుకు సైన్స్‌ఎగ్జిబిషన్స్ ఎంతగానో దోహ దపడతాయని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు అన్నారు. కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రజ్ఞ టెక్నికల్ సైన్స్ ఎగ్జిబిషన్ గురువారం ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు నిరంతరం నూతన అన్వేషణలపై దృష్టి సారిస్తేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఎగ్జిబిషన్‌ను చినఅమిరం, భీమవరం ఝాన్సీలక్ష్మీబాయి ఉన్నత పాఠశాల, విజ్ఞాన భారతి పాఠశాలల విద్యార్థులు తిలకించారు. కళాశాల ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు, కై బ్రహ్మారాజు, వీకె విశ్వనాథరాజు పి రామ్మూర్తి రాజు, ఎం అనిల్ పాల్గొన్నారు.